


TE TL/26/A2635

వాస్తవాలు పలుకు DD9

# వార్త

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:84 | 06-08-2026 గురువారం | పేజీలు: 08 | వెల 3/-



# రేవంత్‌కు విస్తరణ సెగ?

- కర్ణాటక పరిణామాలతో తెలంగాణ కాంగ్రెస్‌లో పెరిగిన అప్రమత్తత
- కేబినెట్ విస్తరణపై అధిష్ఠానం ఆచితూచి అడుగులు
- అసంతృప్తికి చెక్ పెట్టేందుకు ప్రత్యామ్నాయ పదవుల వ్యూహం
- సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యతపై ప్రత్యేక దృష్టి

**తెలంగాణలో ఇంకా ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీతో పాటు కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశాలపై ప్రచారం కొనసాగుతోంది. అయితే కర్ణాటక తరహాలో అసమ్మతి చెలరేగకుండా ముందుగానే అన్ని వర్గాలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.**

హైదరాబాద్, ఆగస్టు 5:

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అనంతరం జరిగిన మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్ పార్టీకి కొత్త సవాళ్లను తెచ్చిపెట్టింది. మంత్రి పదవులు దక్కని పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, కొందరు రాజీనామా హెచ్చరికలు చేయడం వంటి పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లోనూ చర్చకు దారితీశాయి. దీంతో తెలంగాణలో చేపట్టనున్న కేబినెట్ విస్తరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.
తెలంగాణలో ఇంకా ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీతో పాటు కొందరు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే అవకాశాలపై ప్రచారం కొనసాగుతోంది. అయితే కర్ణాటక తరహాలో అసమ్మతి చెలరేగకుండా ముందుగానే అన్ని వర్గాలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి పదవుల కోసం ఇప్పటికే పలువురు సీనియర్ నేతలు, యువ ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారు. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ,

మిగతా 2వ పేజీలో..



# ప్రచారం కోసం సన్మానాలా.. జోరు

- సన్మానాల జోరు పెరిగింది... ప్రజా సమస్యలపై దృష్టి తగ్గిందా?
- అధికారులతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి.. శాలువాలతో సరిపెట్టొద్దు!

కొత్తూరు 05 ఆగస్టు ( డిడి 9 వార్త ప్రతినిధి ):

ఒకప్పుడు సన్మానం అంటే ఓ ప్రత్యేకమైన గౌరవం. సమాజానికి విశేష సేవ చేసిన వారిని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన వారిని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన వారిని, సాహిత్యం, విజ్ఞానం, సామాజిక రంగాల్లో ప్రత్యేక కృషి చేసిన వారిని గుర్తించి సత్కరించడం ఆనవాయితీగా ఉండేది.

మిగతా 3వ పేజీలో..

# 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని పనిచేయాలి
- అర్హుల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

2






8

# 1, 9... మధ్యలో 11...ఓకే యాక్షన్!!

- మైసమ్మ సాక్షిగా రామగుండం బ్లాక్‌బస్టర్
- మైసమ్మ ముందర చుక్క.. ముక్క
- క్లైమాక్స్ లో ఊహించని ఫైట్...
- సినిమాకి కావాల్సిన మసాలా అంతా ఒక్కరోజే
- సైడ్ ఫైటర్స్ లేని 'ఒరిజినల్ ఫైట్
- కథ, స్క్రీన్ ప్లే, ఫైట్లు... అంతా నాయకులే

# తెలంగాణాకు అన్యాయం..!




- అనుమతించిన ప్రాజెక్టుల రద్దు చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా?
- 18న జరగబోయే జీఆర్ఎంబీ సమావేశం అజెండా పూర్తిగా ఏపీకి అనుకూలం
- ఏపీ వితండవాదాన్ని ఎందుకు ఖండించడంలేదు
- సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టును ఏపీ అడ్డుకుంటోంది
- రేవంత్ తెలంగాణకు ద్రోహం చేసి గురుదక్షిణ చెల్లించుకుంటున్నరా?
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీష్‌రావు


హైదరాబాద్, ఆగస్ట్ 5:

ఈనెల 18న హైదరాబాద్ వేదికగా హైదరాబాద్‌లో జరగబోయే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం అజెండాపై తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో ఎజెండాను సిద్ధం చేసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మౌనం చూస్తుంటే జీఆర్ఎంబీ సమావేశం కేవలం ఏపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందా అనే అనుమానం కలుగుతోంది. ఎజెండా వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..

# హరీష్.. తప్పుడు ప్రచారం మానుకోండి

- కట్టు కథలతో బట్ట కాల్చి మీద వేయడమే మీ పనా?
- తొలుత కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పు
- ఏపీకి అమ్ముడుపోయి విమర్శలా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 5 :

ఏపీ ప్రభుత్వం పన్నెండేళ్లుగా ప్రతీ బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నదని, ఇది కొత్త విషయం కాదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా మద్దతు ఇచ్చిన బీఆరఎస్ పార్టీ నేతలు అధికారం కోల్పోగానే కడుపు మంటతో బట్ట కాల్చి మీద వేస్తున్నారని విరుచుకుపడ్డారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆరఎస్ ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదని, ఆ పార్టీ ప్రభుత్వ హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగింది వాస్తవం కాదా, పోలవరం బనకచర్ల ప్రాజెక్టు పనులు ప్రారంuమైంది బీఆరఎస్ హయాంలో కాదా అని ప్రశ్నించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం మీరు అధికారంలో ఉండగా పూర్తి కాలేదా అని నిలదీశారు. తెలంగాణ సొమ్మును లూటీ చేసి అధికారం కోల్పోగానే మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 18న జరిగే 18 జీఆరఎంబీ సమావేశం అజెండాలో చేర్చిన అంశాలు కొత్తవేమీ కావని, ఇవే

మిగతా 2వ పేజీలో..



# 'వరల్డ్ పీపుల్స్'తో భారత్-రష్యా బంధాలు మరింత బలోపేతం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 5 :

స్వాతంత్ర్యానంతరం భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి, ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో అప్పటిసోవియట్ యూనియన్ అందించిన సహకారం చిరస్మరణీయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. భారత్‌రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహం పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ఇది నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయాన్ని ఆ సంస్థ హెడ్ డాక్టర్ రాయల నీతునాయుడుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధుల భావనకు కూడా సోవియట్ రాజ్యాంగం ప్రేరణగా నిలిచిందని గుర్తు చేశారు. రక్షణ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, ఇంధనం, విద్య వంటి అనేక రంగాల్లో భారత్‌రష్యా సంబంధాలు మరింత బలపడుతున్నాయని తెలిపారు.

మిగతా 2వ పేజీలో..

# ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

2

- జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..
- తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు
- సరిహద్దు కృష్ణ బ్రిడ్జి వద్ద ఆహ్లాదకర దృశ్యాలు



## 'వరల్డ్ పీపుల్స్'తో భారత్-రష్యా బంధాలు మరింత బలోపేతం

మొదటిపేజీ తరువాయి

సోవియట్ యూనియన్ అందించిన సహకారం చిరస్మరణీయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. భారత్ రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహం పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ఇది నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయాన్ని ఆ సంస్థ హెడ్ డాక్టర్ రాయల నీతునాయుడుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధుల భావనకు కూడా సోవియట్ రాజ్యాంగం ప్రేరణగా నిలిచిందని గుర్తుచేశారు. రక్షణ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, ఇంధనం, విద్య వంటి అనేక రంగాల్లో భారత్‌రష్యా సంబంధాలు మరింత బలపడుతున్నాయని తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక జీవితంలో సముచిత స్థానం కల్పించడంలో రష్యా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క చెప్పార□T. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పన, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యాలయం ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యాపారం, పర్యాటకం, సంస్కృతి, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రజల మధ్య పరస్పర సహకారం వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ చారిత్రక వారసత్వంతోపాటు సాంకేతిక రంగంలో ప్రపంచ గుర్తింపు పొందిన నగరమని పేర్కొన్న ఆమె ఈ కార్యాలయం భారత్ రష్యా ప్రజల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్నేహం, శాంతి, అభివృద్ధి, సాంస్కృతిక అవగాహనకు దోహదపడే ప్రతి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.



## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

హైదరాబాద్, ఆగస్ట్ 5 :

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటక పరివాహక ప్రాంతాల నుంచి భారీగా ప్రవాహం రావడంతో కృష్ణా, భీమా నదుల్లో వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణానదిపై నిర్మించిన గుర్జాపూర్ బ్యారేజీ తో పాటు యాదగిరి జిల్లా భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీలకు వరద నీరు పోటె త్తింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఈ బ్యారే జీల 40 గేట్లను ఎత్తి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలా లు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు చేరుతుండటం తో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణకర్ణాటక సరి హద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియో లు తీసుకుంటున్నారు. కృష్ణా నదిలో ప్రవాహం రోజురోజుకు వర ద ప్రవాహం పెరుగుతుండడంతో జూరా ల ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివా హక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర ద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# రేవంత్‌కు విస్తరణ సెగ?

మొదటిపేజీ తరువాయి

మైనారిటీ వర్గాలకు చెందిన ఆశావహులు తమకు అవకాశం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. యువ నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ఉన్నప్పటికీ, పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పదవులు దక్కని ముఖ్య నేతలకు నామినేటెడ్ కార్పొరేషన్ల ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, ప్రభుత్వ సలహాదారు హోదాలు వంటి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కేబినెట్ విస్తరణకు ముందే ఈ సర్దుబాట్లు పూర్తి చేస్తే ప్రమాణ స్వీకారం తర్వాత అసమ్మతి తలెత్తకుండా నివారించవచ్చని పార్టీ వ్యూహంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యతకు కూడా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం దెబ్బతినకుండా, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించే విధంగా కేబినెట్ కూర్పు ఉండాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కర్ణాటకలో చోటుచేసుకున్న అసంతృప్తి తెలంగాణలో పునరావృతం కాకుండా ఉండేందుకు మంత్రి పదవులతో పాటు ఇతర కీలక బాధ్యతలపై కూడా ఒకేసారి స్పష్టత ఇవ్వాలనే ఆలోచన కాంగ్రెస్ అధిష్ఠానంలో ఉన్నట్లు తెలుస్తోంది. కేబినెట్ విస్తరణను కేవలం పదవుల పంపకంగా కాకుండా, పార్టీ ఐక్యతను బలోపేతం చేసే రాజకీయ వ్యూహంగా మలచాలనే దిశగా రేవంత్ రెడ్డి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

హైదరాబాద్, ఆగస్ట్ 5:

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూ హక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాల్లకు సంబంధించినదైనా ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి**

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్ లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని, దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు.

# నేడు సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ

- **సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు**
- **సభా ప్రాంగణంలో ప్రముఖుల ఫ్లెక్సీలు**

హైదరాబాద్, ఆగస్టు 5 :






సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సామాజిక న్యాయ తెలంగాణగా పునర్నిర్మించే కర్తవ్యాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన భుజానికి ఎత్తుకున్నారు. సబ్బండ వర్గాల వికాసం.. సాధికారతే లక్ష్యంగా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను గురువారం నిర్వహిస్తున్నారు. సామాజిక వైతాళికులను కీర్తించుకునేలా సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రానికి కొత్త రాజకీయాలను పరిచయం చేస్తూ అందులో ఆయా వర్గాల వారిని ఆమె భాగస్వామ్యం చేయబోతున్నారు. సభా ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తన జీవితం మొత్తాన్ని తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం త్యాగం చేసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్, సామాజిక అంతరాలను రూపుమాపేందుకు కృషి చేసిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే, మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే, అట్టడుగు వర్గాల ప్రజలు పేదరికం, పీడన నుంచి బయట పడేందుకు విద్య మాత్రమే ఆయుధమని నమ్మి పాఠశాలలు ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్రపటాలను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. నిజాం రాజ్యంలో దేశ్‌ముఖ్‌లు, దొరల దురహంకారంపై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య, నిజాం సింహాసనాన్ని వణికించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, బహుజనులకు రాజ్యాధికారం కోసం కృషి చేసిన కాన్షీరామ్, జల్‌జంగిల్‌జమీన్‌పై హక్కుల కోసం పోరు సాగించిన యోధుడు కొమురం భీమ్, నిఖార్సయిన తెలంగాణవాది, ప్రత్యేక తెలంగాణ కోసం మంత్రి పదవి తృణప్రాయంగా వదులుకున్న బహుజన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ, సమాజంలో దోపిడీకి గురవుతున్న వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన కర్పూరి ఠాకూర్ చిత్రపటాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలి తరం తెలంగాణ ఉద్యమకారిణి, ఉమ్మడి ఏపీలో మొదటి దళిత మహిళా ఎమ్మెల్యే, మొదటి మహిళా డిప్యూటీ స్పీకర్ టీఎన్ సదాలక్ష్మి, నిజాం నిరంకుశత్వంపై పోరాడిన బహుజన యోధుడు పండుగ సాయన్న, బహుజన గెరిల్లా యోధుడు వడ్డెర ఓబన్న, బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, ఉమ్మడి ఏపీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన మొదటి మహిళా నాయకురాలు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు సంగం లక్ష్మీబాయి, రజాకర్ల అరాచకాలపై తన కలాన్ని ఎక్కుపెట్టిన అక్షర యోధుడు షోయబుల్లాఖాన్, మలి దశ రాష్ట్ర సాధన పోరాటానికి ఆద్యుడు, కులవర్గ పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న, నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రముఖ కవి, కార్మిక నాయకుడు మఖ్దూం మొహియుద్దీన్‌ల విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# తెలంగాణాకు అన్యాయం..!

మొదటిపేజీ తరువాయి



దారుణమన్నారు. కేఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సాధించుకున్న సాగునీటి ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క సాగర్ (47 టీఎంసీలు) వంటి 7 కీలక ప్రాజెక్టులకు తెచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన ఈ ప్రతిపాదనలను జీఆర్ ఎబీ తన అజెండాలో చేర్చడంపై నిప్పులు చెరిగారు. ఈ అజెండా పూర్తిగా ఏపీకి లాభం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. రాష్ట్ర నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడికి 'గురుదక్షిణ' చెల్లించుకోవడానికే సీఎం నోరు మెదపడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేకపోయిందని, ఉన్న అనుమతులను కూడా పోగొట్టుకునేలా ప్రవర్తిస్తోందని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు ఇవ్వవద్దని ఏపీ చెబితే, దాన్ని బోర్డు అజెండాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ కట్టొచ్చు కానీ సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దంటున్నారని నిలదీశారు. కాళేశ్వరం అనుమతులు రద్దయితే సగం తెలంగాణకు తాగు, సాగునీరు దూరం అవుతుందని.. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను గంపగుత్తగా ఏపీకి తాకట్టు పెట్టాలని చూస్తున్నారా? చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేయాలని చూస్తుంటే... రేవంత్ రెడ్డి రక్తం ఎందుకు మరగడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎప్పుడూ వ్యతిరేకించలేదని పదేపదే చెబుతారు. కానీ జీఆర్ఎంబీ ముందు పెట్టిన ఎజెండా చూస్తే అసలు నిజం ఏంటో అర్థమవుతుంది. కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, కడెంగూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్ వంటి ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను నిలిపివేయాలని, వాటిని పునఃసమీక్షించాలని ఏపీ కోరుతోంది. సమ్మక్క బ్యారేజీకి సంబంధించిన క్లియరెన్సులను కూడా నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ఈ ఏడు ప్రాజెక్టుల అనుమతులను రివ్యూ చేయాలని ఏపీ కోరుతోంది. ఆ ప్రతిపాదనను జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయంటే... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అనుమతుల వల్లే. ఇప్పుడు అదే సీతారామ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని ఏపీ కోరుతోంది. తెలంగాణకు చెందిన ఏడు కీలక ప్రాజెక్టుల అనుమతులను నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? ఇప్పటికే అనుమతులు సాధించిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అధికారం ఎవరు ఇచ్చారు? తెలంగాణ కోసం ఉద్యమం చేసి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించింది. ఇప్పుడు ఆ అనుమతులను రద్దు చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదు. సమ్మక్క, పాలమూరు, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లు రిటర్న్ వచ్చాయి. ఒక్క టీఎంసీ నీటికి కూడా కొత్తగా అనుమతి సాధించలేదు. పైగా బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే పరిస్థితి తీసుకొచ్చారు. తెలంగాణ భవిష్యత్తుతో ఆడుకుంటారా? నిద్రపోతున్నారా? ఎజెండాలో ఈ అంశాలు రావడమే దుర్మార్గమైన విషయమన్నారు. దేశ చరిత్రలో అనుమతులు వచ్చిన తర్వాత వాటిని రివ్యూ చేయడం, రద్దు చేయడం జరిగిన సందర్భాలు ఎక్కడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. మరోవైపు సమ్మక్క బ్యారేజీకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని ఏపీ కోరుతోంది. సమ్మక్కకు అనుమతి ఇస్తే పోలవరానికి నీళ్లు తగ్గుతాయని ఏపీ ఎజెండాలో పేర్కొంది .గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని చంద్రబాబు ప్రభుత్వమే చెబుతోంది. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకెళ్తామని చెబుతున్నారు. మరోవైపు తెలంగాణకు దక్కాల్సిన 968 టీఎంసీలలో భాగంగా సమ్మక్క ప్రాజెక్టు నిర్మిస్తామంటే ఏపీ అడ్డుకుంటోంది. సమ్మక్క సాగర్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు సాధించిందని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఇలాంటి ఎజెండా జీఆర్ఎంబీ ముందుకు వచ్చేదా? అని ప్రశ్నించారు. ఈ ప్రెస్ మీట్ లో మాజీ మంత్రులు ఎల్ర.మణ, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హరీష్.. తప్పుడు ప్రచారం మానుకోండి

మొదటిపేజీ తరువాయి

అంశాలను గత మీటింగులలో, కరెస్పాండోన్స్‌లో కూడా ఏపీ ప్రభుత్వం ప్రస్తావిస్తూ వస్తున్నదన్నారు. ఇవే అంశాలు సీతారామ ఎత్తిపోతల పథకం క్లియరెన్స్ విషయంలోనూ ప్రస్తావించిందన్నారు. దీనిపై తమ ప్రభుత్వం దీటుగా స్పందించి అవన్నీ నిరాధారమైనవని జీఆరఎంబీకి, సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకువెళ్లి ఎసఎసఎంపీ ఎసఆరఎలఐపీ టీఏసీ క్లియరెన్స్(158 మీటింగ్ తేదీ 24.04.2025) విజయవంతంగా అనుమతులు సాధించిందని మంత్రి ఉత్తమ్ గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీ ప్రభుత్వం నిరంతరం జీఆరఎంబీ, సీడబ్ల్యూసీ, జలశక్తి మంత్రిత్వ శాఖకు కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, గూడెం లిఫ్ట్ తదితర ఏడు ప్రాజెక్టుల అనుమతులు ఇవ్వరాదని కోరుతూ వచ్చిందని తెలిపారు. ఎంఓజేఎస్ ద్వారా టీఏసీ క్లియరెన్స్ పొందిన తరువాత కూడా సమీక్షించాలని ఏపీ ప్రతి మీటింగ్‌లో ప్రస్తావిస్తున్నదన్నారు. ఈ సందర్భంలో చెప్పదగ్గ విషయం ఏమిటంటే ఏపీ లేవనెత్తిన ఆ అంశాలను ఈ ప్రభుత్వం దీటుగా ప్రతిఘటించి మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడడంలో సఫలీకృతమైనదని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉదాసీనత ప్రదర్శించడంలేదన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వమే 3వ జీఆరఎంబీ మీటింగ్‌లో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సంబంధించి ఆయా రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరాలి లేదా ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి అని తన వైఖరిని స్పష్టం చేసిందని తెలిపారు. ఈ రెండు రాష్ట్రాలకు నీటి సరఫరా నియంత్రణను జీఆరఎంబీ ప్రారంభించే ముందే ఈ షరతులలో ఏదో ఒకటి నెరవేరాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఇదే విషయాన్నీ పునరుద్ఘాటిస్తూ గత బీఆరఎస్ ప్రభుత్వం సెకండ్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో (6.10.2020) ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం ఏపీతో పోటీ పడి కోరిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తితో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకున్నదన్నారు. ఇదీ ఈ ప్రభుత్వం నిబద్ధత అని అన్నారు.

అంతర్రాష్ట్ర వ్యవహారాల(ఐఎసఎం) డైరెక్టరేట్ క్లియరెన్స్, ఏపీ క్లియరెన్స్ పొందడంలో గత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ముంపు సమస్యకు సంబంధించి కూడా గత ప్రభుత్వం ఆ రాష్ట్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని చాలాసార్లు సంప్రదించి/సందర్శించి, ఐఎసఎం డైరెక్టరేట్ క్లియరెన్స్ పొందేందుకు ముంపు సమస్యకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ నుండి నిరభ్యంతర పత్రం పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎన్‌వోసీ కోసం మూడుసార్లు ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసి ఎన్‌వోసీ కోసం విజ్ఞప్తి చేశామన్నారు. నెలాఖరులో ఇస్తామని సీఎం చెప్పారన్నారు. మీరు అధికారంలో ఉండగా ఒక్కసారి అయినా ఛత్తీస్‌గఢ్ సీఎం ను కలిశారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యంతరాలను సమర్థవంతంగా ప్రతిఘటించి రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి బహుళార్థసాధక సీతమ్మ సాగర్ – సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతులు 24.4.2025న సాధించిందని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్లలో మీరు చేయలేని పని చేశామని, 67 టీఎంసీల నీటి కేటాయింపులు సాధించామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించినట్టు ట్రిబ్యునల్ ఏర్పరిచే విషయంలో కూడా ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తితో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుందన్నారు.

పీబీఎల్‌పీ ప్రతిపాదన గురించి తెలిసిన తర్వాత ఈ ప్రభుత్వం వెనువెంటనే స్పందించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి రెండుసార్లు, నీటిపారుదల శాఖ మంత్రిగా తాను ఏడుసార్లు, పదిసార్లు ప్రధాన కార్యదర్శి, ఈఎన్‌సీ(జి)19 సార్లు వివిధస్థాయిల అధికారుల ద్వారా ఎంవోఈఎఫ్, ఎంవోజేఎస్, ఎంవోఈఎఫ్ అండ్ సీసీ, సీడబ్ల్యూసీ, జీఆరఎంబీ, కేఆరఎంబీ, టీ పీపీఏలతో సుదీర్ఘమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిపామన్నారు. న్యాయపరమైన చర్యలో భాగంగా ప్రభుత్వం సుప్రీమ్ కోర్టు ముందు ఒరిజినల్ సూట్, ఐఏ వ్యాజ్యాలు వేసిందన్నారు. ప్రతివాదులందరూ నాలుగు వారాల్లోగా తమ సమాధానాలను దాఖలు చేయాలని న్యాయస్థానం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. 20182022 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతానికి 200 టీఎంసీల వరద నీటిని తరలించే పనులను ఏపీ ప్రభుత్వం చేపట్టినప్పటికీ అప్పటి బీఆరఎస్ ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితం కాలేదా అని నిలదీశారు. ఆర్డీఎస్‌లో వాటా మేరకు నీళ్ల కోసం ఏ రోజూ బీఆరఎస్ ప్రయత్నం చేయలేదన్నారు. ఆర్డీఎస్ ఆధునీకీకరణ విషయంలో ఏపీ, కర్ణాటక సీఎంలను ఒప్పించాం.. మీరు ఏ రోజైనా కర్ణాటక సీఎంను కలిసి ఒప్పించారా అని నిలదీశారు. కేడబ్ల్యూడీటీలో కృష్ణా జలాల వాటా కోసం స్వయంగా విచారణకు హాజరై న్యాయనిపుణులతో సూచన చేశామన్నారు. గత ప్రభుత్వం కంటే సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని, రాష్ట్ర ప్రజల నీటి హక్కులను పరిరక్షించేందుకు ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు. బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అనే సిద్ధాంతం కలిగిన బీఆరఎస్ ద్వంద్వ విధానాలతో తాము నేర్చుకోవాల్సింది ఏమీ లేదన్నారు. తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయనే కవిత ఆరోపణలకు జవాబు చెప్పాలన్నారు. అ ముడుపుల్లో నీ వాటా ఎంత. తెలంగాణలో అధికారంలోకి రావడం లేదని ఏపీతో కుమ్మక్కై నాగార్జున సాగర్ ప్రాజెక్టును వివాదం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును నిండా ముంచి సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తావా అని మంత్రి హరీష్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సొంత నిధులతో గ్రామాలకు వెలుగులు..

- గ్రామీణ అభివృద్ధికి మరో అడుగు..మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి
- మల్లాపూర్ ఎస్సీ వాడలో ఐమాక్స్ లైట్ల ప్రారంభం



**కొత్తూర్, ఆగస్టు 5 ( డిడి 9 వార్తా ప్రతినిధి ):**

గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపడమే తన లక్ష్యమని మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని మల్లాపూర్ ఎస్సీ వాడలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను మాజీ ఎంపీపీ పిన్నింటి హరిత మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, కొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సొంత నిధులతో ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి, మీనాక్షి దశరథ్ నాయక్, ఉపసర్పంచ్‌లు రాములు గౌడ్, శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ రవి నాయక్, కాట్న రాజు, వార్డు సభ్యులు పవిత్ర దేవేందర్ రెడ్డి, స్వాతి రాజేష్, జార్జి రెడ్డి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ చిర్ర రాజు, చిర్ర సుధాకర్, చిర్ర దర్శన్, మాజీ ఎంపీటీసీ మోడీ దర్శన్, పెండ్లిమడుగు రాజు, కృష్ణ, శ్రీను, మోహన్ నాయక్, అనిల్, వంశీ, శ్రీశైలం, జంగయ్య, శేఖర్ రెడ్డి, దయానంద రెడ్డి, భరత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, పాపిరెడ్డి, భాను, పవన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు

**తాడ్వాయి డిడి9 వార్త**



ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల అధ్యక్షులు మోకాళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది దీనికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరైనారు మండల అధ్యక్షులు ముందుగా మాట్లాడుతూ మన హక్కులను మనం కాపాడుకోవాలంటే ప్రతి గూడెం ప్రతి గ్రామం ఆగస్టు 9వ తారీఖున ఆకుపచ్చ జెండాను ఎగరవేయాలి అని అన్నాడు తర్వాత ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 1/70 చట్టం మరియు 1/59 పిసా చట్టం మరియు అటవీ హక్కుల పట్టాలు ఉన్నటువంటి కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు ఆగస్టు 9వ తారీఖున ప్రతి పల్లె గ్రామంలో ఆకుపచ్చని జెండాలను ఆవిష్కరించాలన్నారు ఆదివాసుల విశిష్ట సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా భారీ ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు ఆదివాసి హక్కులు ఆత్మ గౌరవం కోసం ఆదివాసి సమాజమంతా ఏకమై యువతి యువకులు పెద్దలు ఈ ఉత్సవాలను ఈ వేడుకలను సంతోషంగా జయప్రదము చేయాలని తుడుం దెబ్బ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు కోరారు.

## ఎరువుల సరఫరాలో పాత విధానాన్ని పునరుద్ధరించాలి..

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డీలర్ల అసోసియేషన్ వినతి..

**ఆగస్టు05 డిడి9 వార్త వెంకటాపురం.**



ఎరువుల సరఫరాలో ప్రస్తుతం అమలవుతున్న యాప్ ఆధారిత విధానాన్ని పున ః స మీక్షించి, గతంలో అమలులో ఉన్న ఎఫ్ఓఎల్ (FOL) విధానం ద్వారా డీలర్లకు ఎరువులు సరఫరా చేయాలని వెంకటాపురం ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, విత్తన డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరింది. బుధవారం వెంకటాపురం పర్యటన సందర్భంగా మంత్రికి అసోసియేషన్ ప్రతినిధులు మెమోరాండం అందజేశారు. మెమోరాండంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, యూరియా ఎరువును యాప్ ద్వారా పంపిణీ చేయడం వల్ల రైతులకు సకాలంలో ఎరువులు అందడం లేదని, డీలర్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇదే పరిస్థితి డీఏపీ ఎరువుకు కూడా ఉందని, ఈ నెల 20వ తేదీ నుంచి డీఏపీతో పాటు 20:20:0:13, 24:24:0, 28:28:0, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ తదితర ఎరువులను కూడా యాప్ పరిధిలోకి తీసుకురావడంతో రైతులు, డీలర్లు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. వెంకటాపురం మండలంలో అధిక శాతం కౌలు రైతులు, పోడు రైతులు, చిన్న, సన్నకారు రైతులే ఉన్నందున యాప్ విధానం వల్ల వారికి ఎరువులు సకాలంలో అందకపోతే డీలర్లపైనే అసంతృప్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం ఎఫ్ఓఎల్ విధానాన్ని పునరుద్ధరించి డీలర్లకు నేరుగా ఎరువుల సరఫరా చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేయగలమని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కాంప్లెక్స్ ఎరువుల ధరలు బస్తాకు రూ.400 నుంచి రూ.600 వరకు పెరిగాయని, ఈ పరిస్థితుల్లో యాప్ విధానం కొనసాగితే రైతులతో పాటు ఎరువుల వ్యాపారులు కూడా తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి, గతంలో అమలులో ఉన్న పాత సరఫరా విధానాన్ని పునరుద్ధరించాలని వెంకటాపురం ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, విత్తన డీలర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

# వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలి

- అభ్యంతరకర పోస్టులపై బాధ్యత గ్రూప్ అడ్మిన్ లదే బాధ్యతా వహించాలి
- నార్లపూర్ పోలీస్ స్టేషన్ మేడారం ఎస్ఐ అచ్చ కమలాకర్

**తాడ్వాయి డిడి9 వార్త**



గ్రూప్ అడ్మిన్‌లకు కీలక సూచనలు అభ్యంతరకర పోస్టులు ఎవరైనా పెడితే వెంటనే అప్రమత్తమై తొలగించండి వాట్సాప్ గ్రూపుల్లో చట్టవిరుద్ధ పోస్టులు వద్దు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్త చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు ఎస్ఐ కమలాకర్ వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులు చేసే ప్రతి పోస్టుపై గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అచ్చ కమలాకర్ సూచించారు. గ్రూపులో ఎవరైనా సభ్యులు అభ్యంతరకరమైన, అసభ్యకరమైన, విద్వేషపూరితమైన లేదా చట్టవిరుద్ధమైన పోస్టులు, సందేశాలు, ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటువంటి పోస్టులు చేసే సభ్యులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని, అవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని గ్రూప్ అడ్మిన్‌లకు సూచించారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చట్టాన్ని ఉల్లంఘించే పోస్టులు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో సమాచారాన్ని షేర్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, పుకార్లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ అచ్చ కమలాకర్ సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించే లేదా అభ్యంతరకర పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రజలకు ఉపయోగపడే వేదిక కావాలి అపోహలు, అసత్య ప్రచారం, అభ్యంతరకర పోస్టులకు కాదు అని ఎస్ఐ కమలాకర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ హక్కుల పోరాట సమితి

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మహిపతి అరుణ్ కుమార్
- నిరుపేద గిరిజన దశలిపట్టు రైతులను ఆదుకోవాలని మనవి జేక శేఖర్

**తాడ్వాయి డిడి9 వార్త**

మంచిర్యాల జిల్లా సాంప్రదాయంగా తరతరాలుగా సుమారు 50 సంవత్సరముల నుండి భూములు లేని నిరుపేద గిరిజన దశలీపట్టు రైతులు తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల, కొమరం భీం ఆసిఫాబాద్, భూపాల్ పల్లి మరియు ములుగు జిల్లాలలో తెలంగాణ రాష్ట్ర సెరికల్చర్ డిపార్ట్మెంట్ యొక్క సాంకేతిక సహకారంతో సాగు చేస్తూ వారి యొక్క జీవనోపాధిని గడుపుతున్నారు, వారికి జీవన ఆధారమైనటువంటి అడవినే నమ్ముకుని అడవి పరిసర ప్రాంతాల్లో బ్రతుకుతూ అడవిలో పెరిగే మద్ది చెట్ల మీద దశలిపట్టు పురుగులను పెంచి వాటి ద్వారా వచ్చిన కాయలను అమ్ముకుంటూ వాటి ద్వారా వచ్చిన అరకొర డబ్బులతో వారి యొక్క కుటుంబాలను గడుపుతున్నారు,, ఇటువంటి నిరుపేదలకు సెరికల్చర్ డిపార్ట్మెంట్ దశాబ్దాల కాలం నుండి అనేక రకాలుగా సహాయపడుతూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటూ ఉన్నది,,, కానీ గత కొంతకాలం నుండి నిరుపేద గిరిజన రైతులు అడవి మీద ఆధారపడి పురుగులు పెంచుకొనుటకు అన్ని రకాల అనుమతులు ఉన్న, అట్టి విషయాన్ని ఫారెస్ట్ వర్కింగ్ ప్లాన్ లో పొందుపరిచిన కొంతమంది క్షేత్రస్థాయి ఫారెస్ట్ అధికారులు మరియు సిబ్బంది నిర్దాక్షిణంగా పేద గిరిజన రైతులు మద్ది చెట్లపై పెంచే పురుగులను వాటి కోసం ఏర్పాటు చేసిన వసతులను కొల్లగొడుతూ దశాబ్దల కాలం నుండి దాన్నే నమ్ముకుని బతుకుతున్న నిరుపేద గిరిజన రైతులను హరిగోశ పెడుతూ, ఆర్థికంగా నష్టపరుస్తూ, పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు,, ఇట్టి విషయమై సంబంధిత డీఎఫోలు, రేంజ్ ఆఫీసర్లు మరియు ప్రజా ప్రతినిధులైనటువంటి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ , సిర్పూర్ టీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ మొదలగు వారిని అనేకసార్లు విన్నవించుకున్నను క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ఫారెస్ట్ సిబ్బంది కనీస కనికరం లేకుండా అడవినే నమ్ముకుని బ్రతుకుతున్న అడవి బిడ్డలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ ఆర్థికంగా వారిని కృంగిపోయేలా చేస్తున్నారు,,, ఇట్టి విషయాన్ని ఈరోజు శ్రీ కొమరం భీమ్ వర్ధంతి సభ ఏర్పాటుచేసిన జోడేఘాట్ కెరమెరి నందు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి సీతక్క దృష్టికి శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు ద్వారా మంత్రివర్యులకు తెలియజేయడమైనది, దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ హెడ్ డోబ్రియల్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ రాష్ట్రంకి చెప్పి ఈ సమస్యకు పరిష్కారం చేస్తానని మాటిచ్చారు,, కావున దీనిని







గమనించి మన సెరికల్చర్ డిపార్ట్మెంట్ వారు కూడా ఇట్టి విషయాన్ని డైరెక్టర్ ద్వారా మెంబర్ సెక్రటరీ మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవింపజేసి నిరుపేద గిరిజన రైతులు తరతరాల నుండి దసలిపట్టు సాగునే నమ్ముకుని అడవి మద్ది చెట్లపై ఆధారపడి బ్రతుకుతున్న వారికి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని వేడుకుంటున్నారు

# జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయండి

- ఉద్యోగ కార్మిక వర్గానికి ఏఐటీయూసీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ వైవి రావు జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ పిలుపు.

**డిడి9వార్త / పెద్దపల్లి ఆగస్టు 6:**




ఏఐటీయూసీ పెద్దపెల్లి జిల్లా నాలుగవ మహాసభలను సుల్తానాబాద్ కేంద్రంలో ఈ నెల 20వ తేదీన. యశోద నరహరి ఫంక్షన్ హాల్లో జరుగుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవి రావు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు. ఈ మహాసభకు సిపిఐ జాతీయ నాయకులు ఉమ్మడి రాష్ట్రాల శాసనసభ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్ బాలరాజు సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హాజరు అవుతున్నారు. ఈ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుకోవడానికి మహాసభలో కార్మిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన ఉద్యమ రూప కల్పన జరుగుతుందని అన్నారు ఈ మహాసభకు ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు మధ్యాహ్న భోజనం ఆశ అంగన్వాడి హమాలి ఐకెపి రైస్ మిల్ గోదాం రైల్వే పోస్టల్ ఎల్ఐసి ఎన్టిపిసి ఆర్టీ సీ సివిల్ సప్లై సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం హాజరుకావాలని 20వ తేదీన 10 గంటలకు సుల్తానాబాద్ ఐబి నుండి మహాసభ ప్రాంగణం వరకు జరుగుతుందని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మోహాన్విత వైద్య చికిత్సకు రూ.3 లక్షల ఎల్‌వోసీ అందజేత

### ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, ఆగస్టు 5 (డిడి9 వార్త)**

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పేద కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే భరోసానిచ్చారు. భద్రాచలం నియోజకవర్గం వెంకటాపురం మండలం సురవీడు గ్రామానికి చెందిన పుణ్యం మోహాన్విత వైద్యం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3,00,000 విలువైన ఎల్‌వోసీ ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు బుధవారం భద్రాచలంలోని క్యాంపు కార్యాలయంలో తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. కష్టకాలంలో ఆదుకుని, వైద్య సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా, ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యతగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం



రమాకాంత్, పెద్దినేని శ్రీనివాస్, బొల్లినేని ధర్మారావు, యూత్ నాయకులు గాడి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బంకిపూర్ ఉప ఎన్నికలో ఓటమి బిజెపికి గుణపాఠం

### ఏఐటీయూసీ నేత గొడిశల నరేష్.

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 6:**

బంకిపూర్ ఉప ఎన్నికలో బిజెపికి ఎదురైన ఓటమి దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన పరిణామమని ఏఐటియుసి ఆర్ జీవన్ జీడికే 11 ఇంక్లైన్ మైన్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గొడిశల నరేష్ పేర్కొన్నారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన బిజెపి జాతీయ అధ్యక్షుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో మూడు దశాబ్దాలకు పైగా బీజేపీకి ఆధిపత్యం కొనసాగిన స్థానంలో ఆ పార్టీ పరాజయం చెందడం ప్రజాభిప్రాయంలో వచ్చిన మార్పుకు నిదర్శనమని ఆయన అన్నారు. ఎన్నికల



కమిషన్ ప్రాథమిక అంచనాల ప్రకారం బిజెపికి ఓట్ల శాతం గణనీయంగా తగ్గినట్లు వెల్లడైందని తెలిపారు. ఇటీవల జరిగిన విద్యార్థుల ఆందోళనల అనంతరం వెలుపడిన ఈ ప్రజా తీర్పు అహంకార రాజకీయాలు విభజన విధానాలు ,ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తిరస్కరించగలరనే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు ప్రజలు నిరంకుశత్వాన్ని కాకుండా జవాబుదారితనం ప్రజాస్వామ్య విలువల కలిగిన పాలనను కోరుకుంటున్నారని స్పష్టమైన సందేశాన్ని ఈ ఎన్నికల ఫలితం ఇచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన ప్రశాంత్ కిషోర్ కు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు దేశవ్యాప్తంగా మతతత్వ కార్పొరేట్ ఏజెండను ఓడించేందుకు ప్రజా పోరాటాలకు మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య లౌకిక వ్యక్తుల విస్తృత ఐక్యతను నిర్మించడం నేటి ప్రధాన కథావ్యమని గొడిశల నరేష్ అన్నారు.

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం

**డిడి9వార్త / పెద్దపల్లి ఆగష్టు 6:**



ఈరోజు స్థానిక ఫైవ్ ఇంక్లైన్ ఫోటో భవన్ లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఈరోజు నిర్వహించడం జరిగింది ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో అధ్యక్షులుగా శనిగరపు మల్లేష్ ప్రధాన కార్యదర్శిగా దస మహేష్ కోశాధికారిగా రామగిరి శ్రీనివాస్ అలాగే నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు అనంతరం సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి కరీంనగర్ ఉమ్మడి జిల్లా మరియు మండలాలు నుండి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు హాజరై ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు పెద్దపల్లి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారులు పోగుల విజయ్ , ఇర్ఫాన్ , అల్లం సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ , ఫోటో టెక్ పి పి ఐ ఎన్,అధినేత అభిమన్యు రెడ్డి, ఎడిట్ పాయింట్ రమేష్ , రాష్ట్ర మాజీ కోశాధికారి జూలూరి మధు, కరీంనగర్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కౌశిక్, సంతోష్ పెద్దపెల్లి జిల్లా వివిధ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోశాధికారులు కన్వీనర్ :ఎలగందుల శ్రీనివాస్, బైరం సతీష్,కో-కన్వీనర్ :కోడిపెల్లి శ్రీనివాస్ రావు ,కసివొజ్జుల నరసింహ చారీ, సలహదారులు గట్టు భీష్మ కుమార్ గౌడ్ , తొట్ల శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు ఆరెల్లి శ్రీధర్ గౌడ్ ,ఎరుకల ప్రవీణ్ ,రంగు రాజ సాగర్కు టుంబ బరోసా ఇంచార్జ్ బండారి ప్రసాద్ కుటుంబ బరోసా కో-ఇంచార్జ్ రెడ్డి శ్యామ్ ప్రసాద్, చిప్పకుమార స్వామి ,సంయుక్త కార్యదర్శులు కోడి రామకృష్ణ ,దాగం రాకేష్ ఎంబరి గంగాధర్, కుడిక్యాల శ్రీలలిత, సిరియాల మమత, ప్రచార కార్యదర్శులు గడమల్ల రఘు, దాసరి కిషోర్, మోర విక్రమ్ ,మీడియా ఇంచార్జ్ ఎం.డి. బాషు మియా, గూడూరి పవన్ కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శులు గౌడ రాము, దాసరి కిరణ్, బిసాడి శివప్రసాద్ కార్య వర్గ సభ్యులు ములుకుంట్ల శ్రీనివాస్ గుండేటి మనోహర్ తిప్పారపు కుమార్ ఎర్ర పవన్ కళ్యాణ్ నస్పూరి రమేష్ కన్నెపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే

- **పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు పట్టించుకోని అధికారులు**
- **గాడి తప్పిన స్వచ్ఛత.. కంపుకొడుతున్న కాలనీలు**
- **డంపింగ్ యార్డుల్లా మారుతున్న వైనం**
- **దోమలు,ఈగలు స్వైరవిహారం అనారోగ్యం బారిన కాలనీ ప్రజలు**

**కొత్తూరు 5 ఆగస్ట్ ( డిడి 9 వార్తా ప్రతినిధి ):**





కొత్తూరు మున్సిపాలిటీలో స్వచ్ఛత గాడి తప్పింది.. ఎక్కడ చూసినా..చెత్త కుప్పలే దర్శమిస్తున్నాయి..పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీలు డంపింగ్ యార్డులను తలపిస్తూ.. కంపుకొడుతున్నాయి. దుర్వాసన,రోగాలతో జనం అవస్థలుపడుతున్నారు.ఎన్ని స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా.. కాగితాల్లో ఎన్ని జీవీపీ పాయింట్లు ఎత్తివేసినట్లు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఎకడ వేసిన గొంగళి అకడే అన్నట్లు ఉంది. చెత్తశుద్ధిలో చిత్తశుద్ధి కరువుతున్నది.ఫలితంగా కొత్తూరు మున్సిపాలిటీలో రోగాలు విజృంభిస్తున్నాయి. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ కాలనీలో గత వారం రోజుల నుండి చెత్త వెహికల్స్ రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎక్కడ చెత్త అక్కడే ఉండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు.వెంటనే మున్సిపల్ కమిషనర్ గారు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్ లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్న పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# తీన్మార్ మల్లన్న కలిసిన ములుగు జిల్లా నాయకులు

- **రానున్న రోజుల్లో మీరే టీ ఆర్ పి కి దిక్సూచిగా వెలగాలి**
- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**
- **ములుగు జిల్లా ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి**
- **ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి**
- **ములుగు జిల్లాలో టిఆర్పి బలోపేతానికి కృషి చేస్తున్న దిలీప్ కుమార్ అభినందనీయుడు**
- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న**

**ములుగు, ఆగస్టు 5, డీ డీ 9 వార్త :**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు ఆజం షేక్, యూత్ విభాగం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జాఫర్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు పోలేపాక యాకన్న, వెంకటాపూర్ మండల అధ్యక్షులు రెడ్డి తిరుపతి, మండల ఉపాధ్యక్షులు పందిరి శ్రీనివాస్ తదితరులు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ములుగు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలు, పార్టీ బలోపేతం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన విషయాలను రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలపై తగిన స్థాయిలో పరిశీలించి, ప్రజల తరపున అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ములుగు జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త నాయకుడు ఒక సైనికుని వలె పాటుపడాలని తెలిపారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాలని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్షుని హోదాలో తవిటి దిలీప్ కుమార్ పార్టీ బలోపేతానికి పాటుపడుతున్న తీరు ప్రశంసనీయమని తీన్మార్ మల్లన్న కొనియాడారు. రానున్న రోజుల్లో బీసీలదే రాజ్యాధికారం అని బీసీలంతా ఐక్య మార్గంలో పయనించాలని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుమ్మల రాకతో వెంకటాపురంలో రాజకీయ సందడి..

- **ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు..**
- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వెంకటాపురంలో కాంగ్రెస్ నాయకుల ఘన స్వాగతం**

**ఆగస్టు05 డిడి 9 వార్త వెంకటాపురం.**



వెంకటాపురం, ఆగస్టు 5: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం వెంకటాపురం పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రసాదరాజు దశదినకర్మ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మంత్రి మార్గమధ్యలో వెంకటాపురంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా వెంకటాపురం గెస్ట్ హౌస్‌లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ సమక్షంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావును కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్రావు నివాసానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రితో చర్చించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దనపనేని వెంకటేశ్వర్లు, మన్యం సునీల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టెం సాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలసాని వేణు, మాజీ జెడ్పీటీసీ పాయం రమణ, మద్దుకూరి ప్రసాద్, జి. నాగేశ్వరరావు, కిరణ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో ఎస్సై కే. తిరుపతిరావు, అదనపు పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి చేయూత ఫౌండేషన్ అండ..

### రూ.8 వేల ఆర్థిక సహాయం.. నిత్యావసర వస్తువులు అందజేత..,

**ఆగస్టు 05 డిడి 9 వార్త వెంకటాపురం.**



ములుగు జిల్లా వాజేడు మండలం వాజేడు గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ చెన్నం రాజు ఇంటిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని సామగ్రి, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోవడంతో కుటుంబం సర్వం కోల్పోయి నిరాశ్రయులైంది. ఈ విషాదకర ఘటన గురించి తెలుసుకున్న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం అయ్యప్ప మానవతా దృక్పథంతో స్పందించి, చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.8,000 నగదు ఆర్థిక సహాయం, గిన్నెల సెట్, వాటర్ డ్రమ్ము, కుటుంబ సభ్యులకు దుస్తులు, అలాగే బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా చిడెం అయ్యప్ప మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. సమాజంలో సేవాభావంతో ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సహాయ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పంజా శశికుమార్, బోట లక్ష్మణ్, బట్టి విజయ సూర్య, యసం రమేష్ పాల్గొని బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు. స్థానికులు చేయూత ఫౌండేషన్ సేవలను అభినందిస్తూ, ఆపదలో ఆదుకున్న సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయిపై ఉక్కుపాదం

- **రూ.17.09 లక్షల విలువైన 40.173 కిలోల గంజాయి ధ్వంసం**
- **విక్రయిస్తే కఠిన చర్యలు: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**

గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 81 ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 40.173 కిలోల ఎండు గంజాయి, 26 గంజాయి మొక్కలను న్యాయస్థానం అనుమతితో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ధ్వంసం చేసిన గంజాయి విలువ సుమారు రూ.17.09 లక్షలు ఉంటుందని తెలిపారు. న్యాయాధికారుల సమక్షంలో నమూనాలు సేకరించిన అనంతరం, కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ నిబంధనలను పాటిస్తూ కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో గంజాయిని దహనం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... గంజాయి సాగు, రవాణా, నిల్వ, విక్రయాలు, సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. మత్తు పదార్థాల వ్యాపారంలో పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయించే లేదా వినియోగించే వారి వివరాలను పోలీసులకు అందించిన వారి సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నెల్లుట్లలో హైవేకు సీసీ నిఘా



**జనగామ ఆగష్టు 5 (డిడి 9 వార్త ) బ్యూరో**

లింగాల ఘన్పూర్ మండల పరిధిలోని నెల్లుట్ల గ్రామంలోని స్వరాజ్ షోరూమ్ ఎదురుగా చెరువు సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను ఎంపీడీఓ శివశంకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ నర్సింగ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీఓ సుమన్, పంచాయతీ కార్యదర్శి అనిల్ రాజ్, కరాబార్ చెరుకు అజయ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. రహదారిపై భద్రత, పర్యవేక్షణ మెరుగుపడేందుకు సీసీ కెమెరా ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## నవజాత శిశువులకు తల్లిపాలే శ్రీరామరక్ష

- ఐటీడీఏ పీవో బి.రాహుల్
- ఏరియా ఆసుపత్రిలో లాక్టేషన్ మేనేజ్ మెంట్ యూనిట్
- ప్రారంభించిన ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, ఆగస్టు 5 (డిడి9 వార్త)**

ఆసుపత్రిలో పుట్టిన ప్రతి నవజాత శిశువుకు తల్లి సొంత పాలు మాత్రమే ఇవ్వడాన్ని సంబంధిత డాక్టర్లు ప్రోత్సహించాలని, అలాగే అనారోగ్యంతో ఉన్న నెలలు నిండని నవజాత శిశువులకు కూడా తల్లి సొంత పాలను ఇస్తే శిశువులు ఎటువంటి అనారోగ్యానికి గురికారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో తల్లిపాల ప్రోత్సాహం, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో లాక్టేషన్ మేనేజ్ మెంట్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో రాల్ మాట్లాడుతూ శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు అమూల్యమైనవని, ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని శిశువుకు అందించేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్ కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడాన్ని తల్లులకు ప్రోత్సహించాలని, తల్లిపాలు తీయడానికి సహాయ పడాలని, తల్లుల నుండి సేకరించిన పాలను నిర్ధారణ చేసి సురక్షితంగా భద్రపరిచలని అన్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా సిబ్బందితోపాటు రిసెప్షన్ కౌంటర్, తల్లులకు కౌన్సిలింగ్ గది, తల్లుల కోసం పాలు తీసే గది, శుభ్రంగా స్నానాలు చేసుకునే ప్రదేశంతో పాటు ఫ్రిడ్జ్ , డీప్ ఫ్రీజర్ తో కూడిన పాల నిల్వ గది, బట్టలు మార్చుకునే గది తప్పనిసరిగా ఉండాలని అన్నారు. జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ మాట్లాడుతూ, లాక్టేషన్ మేనేజ్ మెంట్ యూనిట్ ద్వారా నవజాత శిశువులకు అవసరమైన తల్లిపాల నిర్వహణ, తల్లులకు తల్లిపాలపై అవగాహన, సరైన పాలిచ్చే విధానాలపై శిక్షణ, వ్యక్తిగత కౌన్సెలింగ్, అవసరమైన సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ తల్లి–శిశు ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఏడిఎంహెచ్వో సైదులు, ఏరియ ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్ ఎం ఓలు డాక్టర్ల సంతోష్, మల్లేష్, రామకృష్ణ, దేవరాజ్, విజయ్, నరసింహారెడ్డి, యుగంధర్ పాల్గొన్నారు.

## దేవాలయాల సమర్ధ నిర్వహణే ధ్యేయం

- రాష్ట్ర సీత డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు వెల్లడి
- భద్రాచలంలో ప్రారంభమైన ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ మూడు రోజుల శిక్షణా తరగతులు



**భద్రాచలం, ఆగస్టు 5 డిడి9 వార్త**

రాష్ట్రంలో దేవాలయాల సమర్ధ నిర్వహణే ధ్యేయంగా స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ అకాడమీ పని చేస్తుందని సంస్థ డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు అన్నారు. భద్రాచలంలో దేవాదాయ శాఖ మతపరమైన, పరిపాలనా సిబ్బందికి 3 రోజుల శిక్షణ తరగతులను భద్రాచలంలోని అంబా సత్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత భద్రాచలం దేవస్థానం ఈవో దామోదర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన శిక్షణ కార్యక్రమంలో సీత డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు మాట్లాడుతూ ఆలయాల్లో నిత్య ధూప దీప నైవేద్యాలు ఎంతో ముఖ్యమైనవని, ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం పూజాధికాలు జరగాలని స్పష్టం చేశారు. వైదిక సిబ్బంది రామాయణంలోని ధర్మ నిరతిని సిబ్బంది అలవర్చుకోవాలని, హితవువిధుల నిర్వహణలో ఓర్పు, నేర్పు అవసరమని తెలిపారు. అనంతరం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు మాట్లాడుతూ ఆదాయ వ్యయాల పారదర్శకతపై సిబ్బందికి కచ్చితమైన సూచనలు అందేశారు. ఆలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, సమన్వయంతో పనిచేసి ఆలయ కీర్తిని పెంచాలని అన్నారు. తవాస్మి అకాడమీ శ్రీరామ చక్రధర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను ఆలయాల నిర్వహణలో ఉపయోగించాలని, ఆలయాల రికార్డుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంకు ఉమ్మడి జిల్లాలోని దేవాదాయ శాఖకు చెందిన ఉద్యోగులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

## అడవినెక్కలం లోసుమంత్ పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు...

### ప్రముఖ బిఆర్ఎస్ నాయకులు కోటగిరి సీతారామ స్వామి అల్లుడు సుమంత్ హఠాత్ మరణం..

**ఆగిరిపల్లి:ఆగస్టు05( డిడి 9వార్త)**



అశ్వారావుపేట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కోటగిరి సీతారామస్వామి గారి అల్లుడు సుమంత్ గారు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసి, ★బూర్గం పహాడ్–అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు ★ కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమంత్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తాటి వెంకటేశ్వర్లు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోటగిరి సీతారామస్వామిని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కాసాని చంద్రమోహన్ గారు, డాక్టర్ భూక్యా ప్రసాద్ గారు, జజ్జూరపు శ్రీరామ్మూర్తి గారు, మాజీ టౌన్ ప్రెసిడెంట్ సంపూర్ణ గారు, గుడవర్తి వెంకటేశ్వరరావు గారు తదితరులు పాల్గొన్నారు..

## గోదావరిలో డీసిల్టేషన్ వెంటనే విరమించుకోవాలి..

- ఇసుక మాఫియాకు లాభం.. రైతాంగానికి నష్టం..
- సిపిఎం పార్టీ ఆరోపణ..

**ఆగస్టు05 డిడి9 వార్త వెంకటాపురం.**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సీపీఎం మెమోరాండం

వెంకటాపురం, ఆగస్టు 5: సీతమ్మసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పేరుతో ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని గోదావరి నదిలో చేపట్టాలని భావిస్తున్న డీసిల్టేషన్ (పూడికతీత) పనులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు బుధవారం సీపీఎం నాయకులు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ, ఎదిర, సూరవీడు, భోదాపురం, ఆలుబాక తదితర గ్రామాల పరిధిలో గోదావరి నదిలో సుమారు 15 కిలోమీటర్ల మేర భారీ స్థాయిలో ఇసుక తొలగింపునకు అధికారులు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు పూర్తికాకముందే డీసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం వెనుక ప్రజా ప్రయోజనం లేదని, ఇసుక మాఫియాకు లబ్ధి చేకూర్చే ప్రయత్నమేనని విమర్శించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశం ఇంకా పెండింగ్‌లో ఉండగా డీసిల్టేషన్ చేపట్టడం సమంజసం కాదన్నారు. ఈ పనుల వల్ల గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలు తగ్గిపోయి రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఇసుక లారీల రాకపోకలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్లు పూర్తిగా ధ్వంసమై అనేక ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వరదల కారణంగా గోదావరి ఒడ్డున వందల ఎకరాల వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయని, యాకన్నగూడెం నుంచి సుడిబాక వరకు గోదావరి ఒడ్డుకు శాశ్వత కరకట్ట నిర్మించేందుకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్



చేశారు. రైతులకు యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులను గతంలో మాదిరిగానే నేరుగా పంపిణీ చేయాలని, యాప్ ఆధారిత పంపిణీ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం కోరింది. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చిట్టెం ఆదినారాయణ, కాపుల వెంకటేశ్వర్లు, తోట నాగేశ్వరరావు, సాదనపల్లి దేవి, సోలం రంగయ్య, గొంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రచ్చపల్లిలో అయ్యప్ప ధర్మ ప్రచారానికి శంఖారావం







- అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నూతన బ్రాంచ్ కమిటీ ఆవిర్భావం
- ఏకగ్రీవంగా కార్యవర్గం ఎన్నిక

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో నూతన బ్రాంచ్ కమిటీ సమావేశం శివాలయంలో మూల బాలయ్య గురుస్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర వాలంటీర్ కమాండెంట్ జనగామ తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రీ అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శరణు ఘోషల మధ్య అయ్యప్ప ధర్మ ప్రచారం కోసం శంఖారావం పూరించారు. అనంతరం నూతన బ్రాంచ్ కమిటీని ఏకగ్రీవంగా





ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూల బాలయ్య, ఉపాధ్యక్షుడిగా నాగమల్ల భూపతి, కార్యదర్శిగా మోర గణపతి, సంయుక్త కార్యదర్శిగా సూత్రాల వెంకటేష్, కోశాధికారిగా మోర సాయికుమార్, వాలంటీర్ కెప్టెన్‌గా దొనికేని తిరుపతి గౌడ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మూల బాలయ్య, కార్యదర్శి మోర గణపతి మాట్లాడుతూ... ధర్మారం మండలంలో అయ్యప్ప ధర్మ ప్రచారంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, పడి పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జనగామ తిరుపతి మాట్లాడుతూ... అయ్యప్ప ధర్మ ప్రచార కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని, ఈ నెల 9న గోదావరిఖనిలో జరిగే జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ధర్మ ప్రచారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పేద అయ్యప్ప భక్తులను శబరిమలకు తీసుకెళ్లడం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం వంటి పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఏబీఏపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ బ్రాంచ్‌ల ప్రతినిధులు, గురుస్వాములు, స్థానిక అయ్యప్ప భక్తులు పాల్గొని నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చివరగా శ్రీ అయ్యప్ప స్వామి సాక్షిగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు.

## ప్రచారం కోసం సన్మానాలా.. జోరు

- సన్మానాల జోరు పెరిగింది... ప్రజా సమస్యలపై దృష్టి తగ్గిందా?
- అధికారులతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి.. శాలువాలతో సరిపెట్టొద్దు!

**కొత్తూరు 05 ఆగస్టు ( డిడి 9 వార్త ప్రతినిధి ):**

ఒకప్పుడు సన్మానం అంటే ఓ ప్రత్యేకమైన గౌరవం. సమాజానికి విశేష సేవ చేసిన వారిని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన వారిని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన వారిని, సాహిత్యం, విజ్ఞానం, సామాజిక రంగాల్లో ప్రత్యేక కృషి చేసిన వారిని గుర్తించి సత్కరించడం ఆనవాయితీగా ఉండేది.

**కానీ నేడు ట్రెండ్ మారింది... సన్మానాల జోరు పెరిగింది!**

ఏ చిన్న కార్యక్రమమైనా శాలువా కప్పడం, పూలమాల వేయడం, ఫొటోలు దిగడం సాధారణంగా మారిపోయింది.



సన్మానించడం తప్పు కాదు... సత్కరించడం కూడా తప్పు కాదు. కానీ ప్రతి సందర్భాన్నీ సన్మాన కార్యక్రమంగా మార్చడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న తలెత్తుతోంది. ముఖ్యంగా ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారులను రాజకీయ, సామాజిక లేదా వ్యక్తిగత ప్రాతిపదికన పదేపదే సన్మానించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే చర్చకు అవకాశం ఏర్పడుతోంది.

**ఇది అధికారులపై అభిమానమా..? లేక వ్యక్తిగత ప్రచారానికి మరో మార్గమా..?**

అధికారులకు శాలువాలు కప్పడం కంటే వారి ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేలా సహకరించడం ముఖ్యం. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తే అదే నిజమైన గౌరవంగా నిలుస్తుంది. ప్రభుత్వ అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజల హక్కులను కాపాడటం, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడం, సమస్యలకు పరిష్కారం చూపడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేలా సమాజం నుంచి సహకారం అందాలి.

**అభిమానం ఉండాలి... గౌరవం ఇవ్వాలి... కానీ అది మితిమీరకూడదు.**

శాలువాలు, పూలమాలలు, ఫొటోలతో కాకుండా ప్రజలకు జరిగిన మేలుతోనే అధికారి పనితీరుకు నిజమైన సన్మానం దక్కాలి.

## అడిషనల్ సీఎంవో డాక్టర్ ప్రసన్న కుమార్‌కు ఘన సన్మానం

- ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అభినందనలు
- శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**

నూతనంగా సింగరేణి ఏరియా హాస్పిటల్ అడిషనల్ సీఎంవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ప్రసన్న కుమార్‌ను ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.<ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్న కుమార్‌కు పూల బొకే అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపేందర్, ఏఐటీయూసీ నాయకులు నరహరిరావు, గడమల రాకేష్, రామంచ తిరుపతి, ఎలమర్తి శిరీష్,



ఆకునూరి బాలంకుస్, ఇరువురాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ భద్రతపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలి – పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**




సురక్షా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో గోదావరిఖని లోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి హెచ్‌వోడీ అధికారులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంబర్ కిషోర్ ఝా సైబర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, పాల్గొన్న వారితో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ–కేవైసీ మోసాలు, నకిలీ లింకులు, ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ మోసాలపై అవగాహన కల్పించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రస్తుతం నమోదవుతున్న సైబర్ నేరాల్లో దాదాపు 30 శాతం ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌ేనని తెలిపారు. అధిక లాభాల ఆశ చూపిస్తూ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారు, ఆర్థికంగా స్థిరపడిన వారినే సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని హెచ్చరించారు. తెలియని లింకులు, అనుమానాస్పద యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా వచ్చే పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. "ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు" అని చెప్పే వారిని వెంటనే అనుమానించాలని, మోసానికి గురైనట్లు అనిపించిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, పోలీసు శాఖ నిర్వహిస్తున్న సైబర్ అవగాహన కార్యక్రమాలు అత్యంత ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించేలా సంస్థలో విస్తృత ప్రచారం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, రామగుండం సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, సైబర్ క్రైమ్ అధికారులు, సింగరేణి హెచ్‌వోడీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి..

**మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ.**

**మణుగూరు.ఆగస్టు 5 (డి డి 9వార్త)**




ఇటీవల కాలంలో గోదావరి నదికి పై భాగంలోని రాష్ట్రాలలో వర్షాలు బాగా కురిసి గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మణుగూరు మండలం లోని గోదావరి పరివాహక ప్రాంతాలైన చిక్కుడు గుంట, రామానుజవరం, తిర్లాపురం, అన్నారం, కమలాపురం, చిన్నరాయిగూడెం తదితర ప్రాంతాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, దెబ్బతిన్నటువంటి పంటలకు తక్షణమే సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ నాయకులు కుంట లక్ష్మణ్ లు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసలే వర్షాభావం పరిస్థితిల్లో రైతులు విత్తనాలు రెండు మూడుసార్లు వేసి నష్టపోయినటువంటి సందర్భం ఉన్నదని, అందులో ఇప్పుడు గోదావరి వరదలు వచ్చి వేసినటువంటి పంటలను ముంచేసింది. సుమారు రైతు ఒక ఎకరం పత్తి చేనుకు 50 వేల రూపాయలు వరకు పంటకు ఖర్చు పెట్టడం జరిగిందని, అలాగే వరి కి సుమారు 40000 వరకు పంటకు ఖర్చు పెట్టడం జరిగిందని,కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మణుగూరు మండలంలో గోదావరి వరదల వలన నష్టపోయినటువంటి రైతాంగానికి తక్షణమే నష్టపరిహారం చెల్లించి మరల రైతులు వేరే పంట వేసుకోవడం కొరకు ఆర్థికంగా వారికి చేయూతనివ్వాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, ఆవుల నరసింహారావు, ప్రభుదాస్ మౌలానా, అక్కి నరసింహారావు, తురక రామకోటి తదితరులు పాల్గొన్నారు.

# నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు..

**మణుగూరు.ఆగస్టు 5 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నాడు ఇంటర్ విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు రూ.1.5 కోట్ల రూపాయల నిధులతో మౌలిక వసతులు మరియు ఇతర సౌకర్యాలను కల్పించి, ఏజెన్సీలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల విద్యార్థులకు త్వరలో కాలేజీ యూనిఫామ్ ల తో పాటు ఉదయాన్నే అల్పాహారం మరియు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతశ్రేణి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నల్లగట్ల సత్య ప్రకాశ్,అధ్యాపకులు బాబురావు, సురేష్, కృష్ణ, వార్డు సభ్యురాలు శ్రీమతి కోలపిన్ని మానస మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లపై అవినీతి ఆరోపణల దుమారం

- లబ్ధిదారుల నుంచి రూ.లక్ష వసూళ్లు చేస్తున్నారంటూ మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆరోపణలు
- పోచమ్మ తల్లి సాక్షిగా ప్రమాణం చేయాలని అధికార పార్టీ నేతలకు సవాల్
- అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రామగుండం ప్రాంతంలో అవినీతి కూపంగా మారిందని రామగుండం మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, లబ్ధిదారుల జాబితాలో పేరు ఉన్న ప్రతి పేద కుటుంబం నుంచి ఇల్లు మంజూరు చేస్తామనే పేరుతో రూ.1 లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు ఇల్లు మంజూరు కోసం కార్యాలయ ఖర్చులు, ఫైల్ ప్రాసెసింగ్ పేర్లతో బాహాటంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, గతంలో మంజూరైన ఇళ్లను తిరిగి ఇప్పుడే మంజూరు చేస్తున్నట్లు ప్రచారం చేస్తూ పేదలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ నిర్మాణాల్లో కూడా కొందరు నాయకులు జోక్యం చేసుకుని ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అవినీతిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన వారినే లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆమె అన్నారు. స్థానిక కాంట్రాక్టర్లను పక్కనబెట్టి బినామీలకు పనులు అప్పగించడం వల్ల నాణ్యతలేని పనులు జరుగుతున్నాయని, భారీ స్థాయిలో పర్సంటేజీల వ్యవహారం నడుస్తోందని ఆరోపించారు. గోదావరిఖనిలోని పోచమ్మ తల్లి ఆలయంలోకి వచ్చి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేదని అధికార పార్టీ నాయకులు ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. పేదలను దోచుకుంటున్న అవినీతి వ్యవహారాలపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు హెచ్చరించారు.

# ప్రథమ శ్రేణి విద్యార్థినికి రూ.11 వేల ప్రోత్సాహక బహుమతి

- విద్యార్థిని తల్లి, ప్రధానోపాధ్యాయుడిని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్

**బాన్సువాడ, ఆగస్టు 04(డిడి9 వార్త):**



పెద్దకొడప్‌గల్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ కాటేపల్లి పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని సాబ్లె నందిని తరఫున ఆమె తల్లి జేవంతి మధుసింగ్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లప్ప పటేల్ రూ.11 వేల విలువైన ప్రోత్సాహక చెక్కును మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, నందిని తల్లి జేవంతి మధుసింగ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే జడ్పీహెచ్ఎస్ కాటేపల్లి పాఠశాల పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కొనియాడారు.ఉపాధ్యాయుల తరఫున పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఇన్‌చార్జి విద్యాధికారి ప్రవీణ్ కుమార్‌ను మల్లప్ప పటేల్ శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం ద్వారా సమాజ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీ. యాదవ్, మూడ్ శంకర్, ఆర్. లలిత, వి. సునీత, ఎం. సుజాత, ఎం. భక్షిరామ్, జి. మంజుల, పి. అశోక్, దేవదాస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యత్వ నమోద ప్రత్యేక కమిటీ నియామకం

**భద్రాచలం, ఆగస్టు 5 డిడి9 వార్త**

భద్రాచంలో శ్రీ సీతారామ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. కమిటీలో ఇజ్జాడ బాబ్జీరావు, యశోద రామచంద్రరావు, తాండ్ర వెంకటరమణారావు, పరిమి సోమశేఖర్, చల్లగుళ్ళ నాగేశ్వరారవు, వాకచర్ల లక్ష్మీనారాయణలు ఉన్నారు. వీరంతా ఈ నెల 31 లోపు సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేసే బాధ్యతలను నిర్వహించనున్నారు.

## డిగ్రీ అడ్మిషన్స్ స్పెషల్ డ్రైవ్ ద్వారా చివరి అవకాశం

**డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్**

**భద్రాచలం , ఆగస్టు 5 (డిడి9 వార్త)**



డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పొందుటకు స్పెషల్ డ్రైవ్ ను 06.08.2026 నుండి 11.08.2026 వరకు అవకాశం కల్పించడం జరిగిందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేయని, సీటు రాని వారు, సీటు వచ్చి ఎక్కడ ప్రవేశం పొందని వారు, రిజిస్ట్రేషన్ చేసి వెబ్ ఆప్షన్స్ ను పెట్టని వారందరూ కూడా ఈ చివరి అవకాశమును వినియోగించుకోవాలని కోరారు. కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా ఉచిత సేవను పొందవచ్చని ఆయన కోరారు.

## ఈ నెలాఖరులోనే రెండో వంతెనపై రాకపోకలు

**అప్రోచ్ రోడ్డు రక్షణకు శాశ్వత రిటైనింగ్ వాల్ -- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**భద్రాచలం ఆగస్టు 5 (డిడి9 వార్త)**

భద్రాచలం గోదావరి నదిపై నిర్మించిన రెండో వంతెనపై ఈ నెలాఖరులోగా వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. భవిష్యత్తులో వరదల కారణంగా అప్రోచ్ రోడ్డు దెబ్బతినకుండా శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం గోదావరి వరదల కారణంగా కోతకు గురైన రెండో వంతెన అప్రోచ్ ప్రాంతంలో కొనసాగుతున్న మరమ్మతు, రక్షణ పనులను మంత్రి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ విదేశాల నుంచి ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, వారి రాకపోకలు సాఫీగా సాగేందుకు రెండో వంతెన అత్యంత కీలకమని అన్నారు. ముఖ్యంగా శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు, గోదావరి పుష్కరాల వంటి భారీ ఆధ్యాత్మిక వేడుకల సమయంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో ఈ వంతెన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు మందగమనంలో సాగాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేసి పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. ఇటీవల వరదల ప్రభావంతో అప్రోచ్ రోడ్డు దెబ్బతినడంతో వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టామని, ఇకపై వరదల ప్రభావం లేకుండా శాశ్వత రక్షణ కోసం బలమైన రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి రెండో వంతెనను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. వంతెన అందుబాటులోకి రావడం వల్ల ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య భద్రాచలం మీదుగా ప్రయాణించే వాహనదారులకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. మంత్రి వెంట భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్ష సమావేశం..

**సమావేశానికి హాజరైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.ఆగస్టు 5 (డి డి 9వార్త)**



ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో, రాష్ట్ర రెవెన్యూ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమన్వయంతో, త్వరలో ఖాళీ కానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, వ్యూహాలు, ఓటరు నమోదు ప్రక్రియ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు పాల్గొని ఎన్నికలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కూడా సమావేశంలో పాల్గొని, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, పార్టీ బలోపేతం, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## 29 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై లిటిల్ ఫ్లవర్ పూర్వ విద్యార్థులు

- ఆత్మీయ సమ్మేళనంలో గురువులకు ఘన సన్మానం
- పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సందడి చేసిన 1997 బ్యాచ్ విద్యార్థులు
- స్నేహబంధాలను మరింత బలోపేతం చేసిన పూర్వ విద్యార్థుల కలయిక



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**

గోదావరిఖని మార్కండేయ కాలనీలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 1997లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు బుధవారం ఎన్టీపీసీ రామగుండంలోని శ్రీమయి హాలులో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు 29 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న వారు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మల్లిఖార్జున్‌రెడ్డి, వెంకటరమణ, రమేష్, నాగరాజులను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. గురువులు విద్యార్థుల విజయాలను అభినందిస్తూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మాజీ విద్యార్థులు కూడా తమ జీవిత ప్రస్థానంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. అనంతరం పాఠశాల రోజుల అనుభవాలు, సరదా సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సహపంక్తి భోజనాలతో స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రాంతిసుధ, చిందం స్వరూప, స్నేహలత, స్వప్న, పందిల్ల స్వరూప, కరుణాకర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ధర్మేందర్, శివ, కృష్ణ, రవి, అల్లం అంజయ్య, మంకాళి శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో 11 కిలోల గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

- - రూ. 5.43 లక్షల విలువైన సరుకు సీజ్
- మత్తు పదార్థాల రవాణా చేస్తే కఠిన చర్యలు: డీఎస్పీ అరుణ్ కుమార్



**భద్రాచలం, ఆగస్టు 5 (డిడి9 వార్త)**



డీఎస్పీ అరుణ్ కుమార్

మద్యం మరియు మత్తు పదార్థాల అక్రమ రవాణాపై భద్రాచలం పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు, మత్తు పదార్థాల నిర్మూలన కోసం చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా భద్రాచలంలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం భద్రాచలం పట్టణ ఎస్సై బి. రామకృష్ణ పోలీసు సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోవడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కొర్ర నివాసి వివేక్ విరాట్ నాగ్ అలియాస్ వివేక్ నాగ్ (తండ్రి: సుక్రం నాగ్) గా గుర్తించారు. కలిమేలకు చెందిన నితీష్ కుమార్ అనే గంజాయి వ్యాపారి సూచనల మేరకు, ఈ గంజాయిని హైదరాబాద్‌కు తరలించేందుకు నిందితుడు భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ. 5,43,500 విలువైన 11 కిలోల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటనపై భద్రాచలం పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగరాజు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానానికి హాజరుపరిచారు.

### మత్తు పదార్థాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఎస్పీ అరుణ్ కుమార్

ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో కొందరు యువత మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వైపు ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచి, వారిని మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేలా అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం మరియు వాటికి సహకరించే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా ప్రజలు వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు

# సీతమ్మ సాగర్ ను అడ్డుకున్నదే కాంగ్రెస్ పార్టీ

- రాజీవ్ సాగర్ జాప్యం కాంగ్రెస్ పుణ్యమే..
- పది సంవత్సరాలు ప్రాజెక్టును పడావు పెట్టింది మీరు కాదా..!
- కెసిఆర్ కలల ప్రాజెక్టు సీతారామ ప్రాజెక్ట్.
- రేగా కాంతారావు మానస పుత్రిక మారెళ్ళపాడు.
- ప్రతి ఎకరాకు సాగునీరిచ్చే దాకా పోరాటం.
- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్.

**మణుగూరు.ఆగస్టు 5 (డి డి 9వార్త)**



రాజీవ్ సాగర్ జాప్యం కాంగ్రెస్ పుణ్యమేనని,రాజీవ్ సాగర్ పేరుతో 2005 నుండి 2014 వరకు తొమ్మిది సంవత్సరాలు జాప్యం చేసి ప్రాజెక్టు నిర్మించలేకపోయారని,తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడ గోదావరి నీటిని ఆంధ్రాకు తరలించే ఈ ప్రాజెక్టును రీ డిజైన్ చేసి జల దోపిడీ ని అడ్డుకొని 6.5 లక్షల ఎకరాలకు పైగా సాగు నీరినందించే ప్రాజెక్టు తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కలల ప్రాజెక్టు సీతారామ ప్రాజెక్టు అని,ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తట్టెడు మట్టి తీయకుండా స్విచ్చులు వత్తి ఈ ప్రాజెక్టు ద్వారా తరలించిన నీటినే మంత్రులు నెత్తిన చల్లుకోవడం తప్ప రైతులకు చేసింది ఏమీ లేదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అధికార పార్టీపై ద్వజమెత్తారు.అశ్వాపురం మండల పార్టీ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాజీవ్ సాగర్ శంకుస్థాపన చేసింది 2005 సంవత్సరం లో నని ఆనాటి నుండి 2014 మే నెల వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా రాజీవ్ సాగర్ ని పూర్తి చేయలేకపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ నాయకత్వంలో 2017 సంవత్సరంలో సీతారామ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి ఐదు సంవత్సరాల కాలంలో 90 శాతం పైగా పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీళ్లు ఇచ్చి సస్యశ్యామలం చేసే ప్రయత్నం బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. సీతారామ డిపిఆర్ లో మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం లేకపోయిన సందర్భంలో అప్పటి రేగా కాంతారావు చొరవతో 2023 జనవరిలో మంజూరు చేపించి 25 కోట్ల రూపాయలను తక్షణమే నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టడం జరిగిందని, కాలక్రమేణ ఎలక్షన్ కోడ్ వలన గుత్తేదారు పనులను నిర్లక్ష్యం చేయటం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి చందంగా మూడు సంవత్సరముల కాలంలో చేసింది ఏమీ లేకపోయినా ప్రస్తుత ఎమ్మెల్యే మోటార్ ఏర్పాటు చేసి మేమే ఈ పనులు చేసాము, ప్రాజెక్టు తెచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉందని ఎద్దేవా చేశారు.అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా, మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకానికి తట్టెడు మట్టి తీయకుండా,నిర్మించకుండా ఉన్న పరిస్థితుల్లో,స్థానికంగా ఉన్న భద్రాద్రి జిల్లా రైతాంగాన్ని మరచి ఖమ్మం జిల్లా రైతులకు సాగునీళ్లు తీసుకు వెళుతుంటే స్థానిక ఎమ్మెల్యే అచేతనంగా ఉండిపోతే బిఆర్ఎస్ పార్టీ చేసిన పోరాటం వలన మారెళ్ళపాడు పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు.ఆ పనులు కూడా నత్తనడకన సాగుతుంటే బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేసిన పోరాటం వల్ల,ఎక్కడ ఈ ప్రాంత రైతుల ఆగ్రహానికి గురవుతామోనని,రాష్ట్రం లోని నలుగురు మంత్రులు,స్థానిక శాసనసభ్యులు పరుగులు పెడుతున్నది నిజం కాదా,ఈ ప్రాంత రైతాంగానికి తెలియదా,రైతులు ప్రతిదీ గమనిస్తున్నారని, రైతును రాజును చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం అని, పెట్టుబడి సాయం అందించి, సాగునీరు అందించి, జాప్యం లేకుండా ధాన్యాన్ని కొని రైతును సుఖ సంతోషాలతో ఉంచింది గత ప్రభుత్వమే అన్నారు. సీతమ్మ బ్యారేజ్ 37 టిఎంసి ల నీటిని గోదావరిలో నిల్వ సామర్థ్యంతో గత ప్రభుత్వంలో మంజూరై చక చక పనులు జరుగుతున్న సందర్భంలో కోర్టులలో కేసులు వేసి సీతమ్మ బ్యారేజ్ కి అడ్డుగా నిలిచి పనులను నిలిపించింది కాంగ్రెస్ పార్టీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఆనాడు కోర్టులలో కేసులు వేపించి అడ్డుకొని ఇప్పుడు నవ్విపోదురు గాక నాకేల సిగ్గు అన్నట్లు ఈరోజు సీతమ్మ బ్యారేజ్ కు పర్యావరణ అనుమతులు తెచ్చాం అని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. రైతు వ్యతిరేకి ఎవరో,రైతుల పక్షపాతి ఎవరో రాబోయే రోజుల్లో రైతులే నిర్ణయిస్తారని, కనీసం యూరియా బస్తాలు ఇయ్యటం కూడా ఈ ప్రభుత్వానికి చేత కావట్లేదన్నారు. రోజుకొక యాప్ పేరుతో రైతుల చెప్పులు అరిగేలా యూరియా కోసం తిప్పించుకుంటున్నారని,వారి ఉసురు ఈ ప్రభుత్వానికి తగులుతుందన్నారు.మీరెన్ని పర్యటనలు చేసినా,ఎన్ని మాయ మాటలు చెప్పినా,రేగా కాంతారావు మానస పుత్రిక మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకం ద్వారా పినపాక నియోజకవర్గం లోని ప్రతి చివర ఎకరా వరకు సాగునీరు అందించేదాకా రైతుల పక్షాన పోరాటం ఆపేది లేదన్నారు. అశ్వాపురం మండలంలోని 24 గ్రామపంచాయతీలలోని చెరువులు కుంటలు నింపేవరకు కొట్లాడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, ఈదర సత్యనారాయణ, వెన్న అశోక్ కుమార్,నేలపట్ల సత్యనారాయణ రెడ్డి,చిలక వెంకటరమయ్య,మండల యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ,ఆనందాపురం సర్పంచ్ ముర్రం సమయ్య,ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్,శివారపు డాక్టర్ బాబు,మందా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణులకు నాణ్యమైన వైద్యం చేరువే లక్ష్యం

- డాక్టర్ పోతరాజు ప్రశాంత్
- పురుషోత్తపట్నంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి
- రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్ – పద్మావతి హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతమైన మెగా మెడికల్ క్యాంపు

**భద్రాచలం, ఆగస్టు 5 (డిడి9 వార్త)**




గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ రివర్‌సైడ్, భద్రాచలం మరియు పద్మావతి హాస్పిటల్స్, భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో పురుషోత్తపట్నంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విశేష స్పందనతో విజయవంతమైంది. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి, సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాల నిర్వహణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. శిబిరంలో ప్రముఖ స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డా. మండవ తేజస్వి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డా. సాయి కిషోర్ కంచేటి, డా. ప్రశాంత్, డా. కల్లెం సుకన్యా రెడ్డి పాల్గొని రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. రోగులకు ఉచిత ఓపీ కన్సల్టేషన్‌తో పాటు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే శిబిరంలో వైద్యులను సంప్రదించిన వారికి ఒక నెలపాటు అన్ని ల్యాబ్ పరీక్షలు, స్కాన్లు, 2డీ ఈకో, ఈసీజీ పరీక్షలపై 50 శాతం ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ, ప్రస్తుతం పద్మావతి హాస్పిటల్స్‌లో స్త్రీ & ప్రసూతి వైద్యం (గైనకాలజీ), చిన్నపిల్లల వైద్యం (పీడియాట్రిక్స్), ఎన్ఐసీయూ (NICU), జనరల్ మెడిసిన్, క్లినికల్ కార్డియాలజీ, ఐసీయూ & క్రిటికల్ కేర్ సేవలతో పాటు క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన మెడికల్ ఆంకాలజీ, కీమోథెరపీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఎండోస్కోపీ సేవలు, అలాగే బీపీ, మధుమేహం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రజల నుంచి లభించిన విశేష స్పందన తమకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా దమ్మపేట మండలంలో రూ. 95 లక్షలతో పనులకు శ్రీకారం





- ఎమ్మెల్యే జారెఆదినారాయణ..
- దమ్మపేట మండలంలో విస్తృత పర్యటన

**అశ్వారావుపేట:ఆగస్టు05(డిడి 9వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో రూ. 95 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, పసిపిల్లల ఆరోగ్యం, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పలు పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. మొదటిగా మల్కారం గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గుత్తావారిగూడెం గ్రామంలో చిన్నారుల సంక్షేమం కోసం నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (PD) గారి భాగస్వామ్యంతో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొని, వాటిని ఘనంగా నిర్వహించారు. తరువాత గుర్వాయిగూడెం గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థుల భద్రత కోసం నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ కాంగ్రెస్ నేత తంగిళ్ళ విశ్వనాథ్ గారి అమ్మ గారు రాములమ్మ గారిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుంజా సుజాత గారి నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఆ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గండుగులపల్లి గ్రామంలో రాకపోకల సౌకర్యం కోసం సీసీ రోడ్డులు నిర్మాణానికి మరియు కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ పిడి (PD) గారి,స్థానిక సర్పంచులు ఉప సర్పంచులు జిల్లా,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్‌పై గ్రామస్థులకు అవగాహన



**జనగామ ఆగస్టు 5(డిడి 9వార్త )బ్యూరో**

నర్మెట్ట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపగోని శ్రీధర్ గౌడ్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. పించన్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, తపాలా సేవలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించారు. ప్రజలు వినిపించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని సర్పంచ్ తెలిపారు.స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా తడి, పొడి, గృహ ప్రమాదకర, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాల్సిన అవసరాన్ని గ్రామ కార్యదర్శి మొహమ్మద్ నాసర్ వివరించారు. గ్రామ పరిశుభ్రతకు ప్రతి కుటుంబం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొలపాక స్వామి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# 1, 9... మధ్యలో 11...ఓకే యాక్షన్!!







- **మైసమ్మ సాక్షిగా రామగుండం బ్లాక్‌బస్టర్**
- **మైసమ్మ ముందర చుక్క.. ముక్క**
- **క్లైమాక్స్ లో ఊహించని ఫైట్...**
- **సినిమాకి కావాల్సిన మసాలా అంతా ఒక్కరోజే**
- **సైడ్ ఫైటర్స్ లేని 'ఒరిజినల్ ఫైట్**
- **కథ, స్క్రీన్ ప్లే, ఫైట్లు... అంతా నాయకులే**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 05 (డీడీ9 వార్త):**

కథకి కావాల్సిన ఎలిమెంట్స్ అన్నీ కలగలిపితే అది వెండితెర సినిమా అవుతుందేమో గానీ... రామగుండం రాజకీయ నాయకులు మైసమ్మ సాక్షిగా నడిపిన డ్రామా మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఒక వైపు సంప్రదాయం, మరోవైపు ఊపేసే డాన్సులు, నోరూరించే దావత్... ఇదంతా చూసి వీళ్ల ఐక్యత చూసి డిజైన్ చేసిన విమర్శకులు కూడా క్లాప్స్ కొడదాం అనుకునే లోపే... ఊహించని ట్విస్ట్! సినిమాకు ఫైట్ సీన్ ఒక్కటే తక్కువైంది అనుకున్నారో ఏమో, ఎండ్ కార్డ్ పడే సమయానికి 'సైడ్ ఫైటర్స్ కూడా లేని క్లైమాక్స్ ఫైట్' ని ఓపెన్ గానే ఇచ్చేశారు!

**సీన్ 1: గ్రాండ్ సెలబ్రేషన్స్, దావత్**

బుధవారం చెట్లల్ల కార్యక్రమం అట్టహాసంగా మొదలైంది. రామగుండం నాయకులంతా ఒక్కటై మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. మేకను కోశారు భక్తి పారవశ్యం.. చెట్లల్ల వండారు: అసలైన విలేజ్ వైబ్స్..చుక్క.. ముక్క కానిచ్చారు.... నాయకులంతా పక్కపక్కనే కూర్చుని ఐక్యతారాగాన్ని ఆలపించారు.

చిందేసిన డాన్సులు, గొంతు ఎత్తి పాడిన పాటలతో మైసమ్మ పూజ కాస్త ఒక పెద్ద ఫెస్టివల్ మోడ్ లోకి వెళ్ళిపోయింది. 'అబ్బా... మన నాయకులు ఎంత కలిసి పోయారో' అని అభిమానులు మురిసి పోతున్న లోపే ప్లాన్ రివర్స్ అయింది.

**సీన్ 2: 'లోపటి విలనిజం' బైటికి వచ్చింది!**

దావత్ ముగిసింది... చుక్క కిక్కు ఎక్కింది... లోపల దాక్కున్న పొలిటికల్ విలనిజం నిదానంగా తన్నుకొచ్చింది!

నవ్వుల వెనుక నజ్జు పొంగుతుందన్నది నానుడి... ఇక్కడ మీసాల వెనుక ప్లాన్‌లు అమలవుతున్నాయన్నది నిజం!" అప్పటి వరకు చేతులు కలిపిన నాయకులే, ఒక్కసారిగా తొడలు కొట్టే రేంజ్ లో మాటల ఈటెలు విసురుకున్నారు. ఇక ఆలస్యం ఎందుకని సైడ్ ఫైటర్స్ (క్యారెక్టర్ ఆర్టిస్టులు/కార్యకర్తలు) ప్రమేయం లేకుండానే ప్రధాన నాయకులే నేరుగా సీన్‌లోకి దిగి క్లైమాక్స్ ఫైట్ స్టార్ట్ చేశారు.

**ఇది ప్రీ-ప్లాన్డ్ స్కెచ్ ఏనా?**

స్థానికంగా ఇప్పుడు ఇదే అతి పెద్ద హాట్ టాపిక్!

మైసమ్మ తల్లి సాక్షిగా జరిగింది పూజ మాత్రమే కాదా? ముందుగానే వేసుకున్న వ్యూహమా?

చుక్క పడ్డాకే ఈ ప్లాన్లు బయటకు వచ్చాయా?

లేక, కావాలనే ఒక స్కెచ్ ప్రకారం ఈ రచ్చను క్లైమాక్స్ వరకు తీసుకెళ్లారా?

మైసమ్మ దయ వల్ల పూజ, దావత్, డ్యాన్సులు ఎంత సక్సెస్ అయ్యాయో... నాయకుల అసలు స్కెచ్ కూడా అంతే ఘనంగా 'రచ్చ రచ్చ' అయి బయట పడింది.

**ఫైనల్ కట్(క్లైమాక్స్ సీన్)**

ఏది ఏమైనా రామగుండం నాయకులు మాత్రం తమ అభిమానులకి, ప్రజలకు ఎలాంటి కొరత లేకుండా పూర్తిస్థాయి పొలిటికల్ యాక్షన్ డ్రామా ను ఫ్రీగా చూపించేశారు. 1, 9 మధ్యలో 11లతో మొదలైన ఈ నంబర్ గేమ్... చివరికి ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

## మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### 15వ వార్డులో 'ఇందిరమ్మ చీరలు' పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ తూము పద్మ



**బోధన్, నిజామాబాద్ జిల్లా 05 ఆగస్టు(డీడీ9 వార్త) :**

రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలిపేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 15వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు 'ఇందిరమ్మ చీరలను' ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతామన్న మాటకు కట్టుబడి, ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ద్వారా మహిళా సాధికారతకు బాటలు వేస్తోందని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్న రేవంతన్న ప్రభుత్వానికి మహిళలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ వార్డు వ్యాప్తంగా మహిళల అభ్యున్నతే ధ్యేయంగా మరిన్ని బృహత్తర కార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు 500 ప్లేట్లు పంపిణీ చేసిన మహేందర్

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్)**




బోథ్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం వినూత్న రీతిలో ఓ కుమారుడు తన తండ్రి జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిగెల మహేందర్ (మెడికల్) తన తండ్రి దివంగత మునిగెల ఆశన్న జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు ఉపయోగపడేలా ప్లేట్లను అందజేశారు. గత నెల 17వ తేదీన అకాల మరణం చెందిన తన తండ్రి ఆశన్న ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 500 మంది విద్యార్థులకు మహేందర్ సొంత ఖర్చులతో ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అనురాధ మాట్లాడుతూ... తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల తరపున, పాఠశాల యాజమాన్యం తరపున మహేందర్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల పోషకులు (తల్లిదండ్రులు) విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ మోసాలకు చెక్..అవగాహనతోనే రక్షణ

- **'సురక్షా కా తిరంగా'తో సైబర్ భద్రతకు కొత్త ఊపు**
- **మోసపోకండి..మోసాలను అడ్డుకోండి.. విద్యార్థులకు సైబర్ సందేశం**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 5 :**

సైబర్ నేరాలపై యువతను అప్రమత్తం చేసేందుకు జీడిమెట్ల పోలీసులు బుధవారం చింతల్‌లోని ఎంసీపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు నెల సైబర్ జాగృతి దివస్ సందర్భంగా "సురక్షా కా తిరంగా – సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ" అనే అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో చింతల్ పరిసర ప్రాంతాల ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 500 నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ బాలగంగి రెడ్డి, జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలు, ఫిషింగ్ లింకులు, ఓటీపీ, క్యూఆర్ కోడ్, సోషల్ మీడియా మోసాలు వంటి సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. అలాగే "సురక్షా కా తిరంగా" ప్రచారంలో భాగంగా అప్రమత్తత, అవగాహన, సురక్షిత డిజిటల్ జీవనం అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్కు కాల్ చేసి, జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన వీడియోలను ప్రదర్శించగా, అనంతరం విద్యార్థులతో నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమం ఆకట్టుకుంది. కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా సైబర్ అవగాహన పెంపొందించి సురక్షిత డిజిటల్ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీడిమెట్ల పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ బాలగంగి రెడ్డి, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## బోధన్ లో శ్మశానవాటిక నిధుల 'కాజేత'పై లోకాయుక్త విచారణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 05 ఆగస్టు(డీడీ9 వార్త) :**



బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు దళితులకు చెందిన శ్మశానవాటిక అభివృద్ధి నిధుల అక్రమాలపై తెలంగాణ లోకాయుక్త విచారణ వేగవంతం చేసింది. శ్మశానవాటిక స్థలంలో పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండానే లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని కాజేశారన్న మాజీ కౌన్సిలర్ టి.రాజవిట్టల్ ఫిర్యాదు మేరకు బుధవారం అధికారుల ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. 2018వ సంవత్సరంలో శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం రూ. 8 లక్షలు మంజూరు చేసింది. అయితే నిర్మాణం పూర్తి కాకుండానే రూ. 7.80 లక్షల బిల్లులు చెల్లించి నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే 2023లో 'పట్టణ ప్రగతి' కార్యక్రమంలో భాగంగా శౌచాలయాల నిర్మాణం కోసం కేటాయించిన రూ. 4.43 లక్షల నిధులను అసలు పనులే ప్రారంభించకుండానే డ్రా చేసుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు అక్రమార్కులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నిధుల గోల్‌మాల్‌పై ఆధారాలతో సహా లోకాయుక్తకు ఫిర్యాదు అందడంతో స్పందించిన తెలంగాణ లోకాయుక్త సంస్థ, బుధవారం ప్రత్యక్ష తనిఖీలకు ఆదేశించింది. లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ పి.జయపాల్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ వీవీ రమణ మూర్తి నేతృత్వంలోని అధికారుల బృందం బోధన్ 16వ వార్డు శ్మశానవాటికను సందర్శించింది. క్షేత్రస్థాయిలో ఉన్న నిర్మాణ ఆనవాళ్లను, మున్సిపల్ ఇంజినీరింగ్ రికార్డులను, ఎం-బుక్ నమోదులను అధికారులు నిశితంగా ఆరా తీశారు. త్వరలోనే పూర్తి వివరాలతో కూడిన నివేదికను లోకాయుక్తకు సమర్పిస్తామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో మునిసిపల్ చైర్మన్ తూము శరత్ రెడ్డి, కమిషనర్ జాదవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

## సాలూరలో మెగా వైద్య శిబిరం విజయవంతం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 05 ఆగస్టు(డీడీ9 వార్త) :**



గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలను అందించే లక్ష్యంతో సాలూర మండల కేంద్రంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన 'మనోరమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన సుమారు 750 మంది ప్రజలు హాజరై వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు శిబిరానికి విచ్చేసి రోగులకు వైద్య సలహాలు, సూచనలు అందించారు. స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె సమస్యలు, నరాలు, వెన్నుపూస, మెదడు సంబంధిత వ్యాధులు, కిడ్నీలో రాళ్లు, ఎముకలు, కీళ్ల నొప్పులతో పాటు చిన్న పిల్లల ఆరోగ్యం, సాధారణ రుగ్మతలకు సంబంధించి ప్రత్యేక వైద్య నిపుణులు బాధితులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల అనంతరం వ్యాధుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులందరికీ అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఉచితంగా వైద్య సేవలు అందించిన మనోరమ ఆసుపత్రి యాజమాన్యాన్ని, వైద్య బృందాన్ని సాలూర గ్రామ సర్పంచ్ సొక్కం లావణ్య రవి కొనియాడారు. సేవలు అందించిన వైద్యులను ఈ సందర్భంగా ఆమె శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం పర్యవేక్షకులు గైని రమేష్, వివిధ విభాగాల వైద్యులు, గ్రామస్తులు సొక్కం రవి, ప్రకాష్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518